W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

9-12-2025



# హెూరా-హెూరీగా పంచాయతీ పోరు



02

భద్రాద్రీ కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితి సింగారం పంచాయతీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వార్డుల్లో కుదిరిన రాజకీయ పొత్తులు సర్పంచ్ స్థాయికి రావడంతో ఒక్కసారిగా తారుమారయ్యాయి. కాంగ్రెస్-టిడిపి-బిఆర్ఎస్‌ల త్రిముఖ పోరు ఓట ర్లను గందరగోళానికి గురిచేస్తుండగా, మూడు పార్టీల కీలక నేతలు బహిరంగ ప్రదర్శనగా ప్రచార రంగంలో జోష్‌ను జోడిస్తున్నారు.


## విలేఖరులు కావలెను

తెలుగు పత్రికారంగంలో వేగంగా దూసుకెళ్తున్న 'మహా పత్రిక' ప్రతిష్ఠాత్మక రిపోర్టర్ (విలేఖరి) నియామకాలు - కింది కేంద్రాల కోసం విలేఖరులు కావలెను

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నియామక కేంద్రాలు

| | | |
|---|---|---|
| పాల్వంచ | సుజాత నగర్ | చుంచుపల్లి |
| లక్ష్మీదేవి పల్లి | ఇల్లందు | గార్ల |
| బయ్యారం | మణుగూరు టౌన్ | మణుగూరు రూరల్ |
| అశ్వాపురం | సారపాక | గుండాల |
| భద్రాచలం | దుమ్ముగూడెం | చర్ల |
| చంద్రుగొండ | వాజేడు | ములకలపల్లి |
| | నుగూరు వెంకటాపురం | |

ఎదుగుదలకు వేదిక – కొత్త ప్రతిభకు స్వాగతం
స్థానిక వార్తలపై ఆసక్తి - రిపోర్టింగ్ పట్ల ప్యాషన్
డిజిటల్/ప్రింట్ మీడియా అనుభవం ఉంటే ప్రాధాన్యం

9581805907, 9346923469
7436939999


## సర్కార్ ఆదాయానికి రూ. 70 కోట్ల భారీ గండి!

**రేపటి నుంచే వైన్ షాపులకు తాళాలు**

**ఖమ్మం, కొత్తగూడెం సరిహద్దుల్లో హై అలర్ట్**

**లిక్కర్ దందాపై ఆబ్కారీ ఉక్కుపాదం**

**ఎలక్షన్ దెబ్బకు 215 షాపుల ఆదాయం హుష్ కాకి!**



ఖమ్మం బ్యూరో, మహా

05

# మందు.. బంద్

రాజకీయ చైతన్యానికి మారుపేరైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పుడు విచిత్రమైన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి తారాస్థాయికి చేరిన వేళ, మందు బాబుల గొంతు తడిపే 'కిక్కు'కు మాత్రం బ్రేక్ పడింది. సాధారణంగా ఎన్నికలంటేనే మందు, విందు జోరుగా సాగుతాయని అందరూ భావిస్తారు. కానీ, ఎన్నికల సంఘం తీసుకున్న కఠిన నిర్ణయంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మద్యం ప్రియులకు నిరాశే మిగిలింది. రేపటి (డిసెంబర్ 9) నుంచి ప్రారంభం కానున్న ఈ 'డ్రై డేస్' ప్రభావం కేవలం మందు బాబులపైన మాత్రమే కాదు, జిల్లా ఆర్థిక ముఖచిత్రంపైన, ప్రభుత్వ ఆదాయంపైన తీవ్ర ప్రభావం చూపనుంది.

### సరిహద్దు సవాలు.. ఆంధ్రా బోర్డర్ పై డేగ కన్ను

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఉన్న మరో ప్రత్యేకత ఆంధ్రా సరిహద్దు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, భద్రాచలం వంటి ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆనుకుని ఉన్నాయి. తెలంగాణలో షాపులు బంద్ పాటిస్తుండటంతో, మందు బాబులు సరిహద్దు దాటి ఏపీకి వెళ్లి మద్యం తెచ్చుకునే ప్రమాదం ఉంది. లేదా అక్కడి నుంచి అక్రమంగా మద్యం జిల్లాలోకి రవాణా అయ్యే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఖమ్మం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. సరిహద్దుల్లోని చెక్ పోస్టుల వద్ద నిఘాను తీవ్రతరం చేశారు. ఆంధ్రా నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి నిల్వ ఉంచిన మద్యాన్ని, బెల్టు షాపుల ద్వారా విక్రయించే ప్రయత్నాలను అడ్డుకోవడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దించారు.

06



## కొబ్బరి పీచు వాహనంలో రూ.కోటి గంజాయి

గుట్టుచ ప్పుడు కాకుండా తరలిస్తున్న సుమారు కోటి రూపాయల విలువ గల గంజాయిని భద్రాచలం పోలీస్ అధికారులు చాక చక్యంగా పట్టుకున్నారు. సుమారు కోటి రూపాయల పైన విలువ గల గంజాయిని సమయ స్ఫూర్తితో పట్టుకున్న అధికారు లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్, భద్రాచలం ఏఎస్పీ విక్రమ్ సింగ్ కుమార్ ఐపిఎస్ అభినం దించారు.



08

3 మంది మావోయిస్టులు

## లొంగుబాటు

**ముఖ్యమంత్రి విష్ణు, హెూం మంత్రి విజయ శర్మ సమక్షంలో లొంగుబాటు**

ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో సిసిఎం మావోయిస్టు రామ్‌ధేర్ మజ్జి తన 12 మంది సహచరు లతో కలిసి లొంగిపోయాడు. ఇది సోమవారం ఉదయం బకర్‌కట్ట పోలీస్ స్టేషన్‌లోని కుంహి గ్రామంలో జరిగింది. అక్కడ అన్ని కేడర్లు తమ ఆయుధాలను విడిచిపెట్టి పోలీసుల ముందు లొంగిపోయారు. భద్రతా సంస్థలు ఈ చర్యను మావోయిస్ట్ నిర్మాణానికి నిర్ణయాత్మక దెబ్బగా భావిస్తున్నాయి.




08

## మా ఇంటి ఓటు అమ్మబడదు

**అంబేద్కర్ ఆశయాన్ని ప్రతిబింబించిన యువకుడి వినూత్న ప్రచారం!**

ఎన్నికల పర్వం నడుస్తున్న వేళ, ఓటు హక్కు విక్రయంపై విస్తృత చర్చ జరుగుతున్న నేపథ్యంలో, భద్రాద్రి కొత ్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, తిరుమలకుంట గ్రామానికి చెందిన ఓ యువకుడు వినూత్న నిరసనతో ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఓటు విలువను, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ ఆశయాన్ని చాటిచెబుతూ ఏకంగా తన ఇంటి గేటుకే ప్రత్యేకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి స్ఫూర్తిగా నిలిచాడు.

## మద్యం దుకాణాలు బంద్: కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం,మహా:** డిసెంబర్ 11, 14, 17 తేదీలలో జరిగే మూడు విడతల గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఆయా మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సోమవారం తెలిపారు. డిసెంబర్ 11 న జరిగే మొదటి విడత ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 9 వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుండి డిసెంబర్ 11న ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించే వరకు కొణిజర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో మద్యం విక్రయాలను నిలిపివేయాలన్నారు.

## మాజీ సర్పంచ్ క్షుద్రపూజలు...వీడియో వైరల్



**మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం కొమ్ముగూడెం గ్రామంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. మాజీ సర్పంచ్ నారపోగు నాగరాజు క్షుద్రపూజలు చేస్తూ అమాయక గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ మేరకు అన్నం రాసులపై మాంసం, రక్త తర్పణాలు చేస్తూ గాల్లోకి నిమ్మకాయను లేపిన వీడియో వైరల్ అయ్యింది. డబ్బు కోసం నాగరాజు మూఢనమ్మకాలు వ్యాపింపజేస్తున్నాడని, పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులు కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కొన్ని మీడియా సంస్థలు నిజాలు పరిశీలించకుండా వాళ్లు చెప్పింది నమ్మి వార్తను వైరల్ చేశాయని పేర్కొన్నాడు. ఆ తప్పుడు సమాచారాన్ని మీడియాకు అందించిన వ్యక్తులపై, అలాగే నిజాలు నిర్ధారించకుండా ప్రచారం చేసిన మీడియా సంస్థలపై కూడా ఫిర్యాదు చేయనున్నట్టుగా సమాచారం.

## స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



**మణుగూరు, మహా:** గ్రామ పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో మణుగూరు పోలీస్ శాఖ శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా సోమవారం పట్టణంలో భారీ కవాతు నిర్వహించింది. ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగేలా, ప్రతి ఓటరు తన ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పోలీసులు సిద్ధంగా ఉన్నారని అధికారులు భరోసా ఇచ్చారు. కవాతుకు మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి నేతృత్వం వహించగా, సీఐ నాగబాబు, సీఐ వెంకటేశ్వర్లు, సీఐ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు ఎస్సై నగేష్‌కుమార్, ఎస్సై శ్రావణ్‌కుమార్, ఎస్సై రాజేష్, అలాగే ఏఎస్ఐలు శాంతి, జ్యోతి, రామచంద్రారెడ్డి, నిరోష, ఝాన్సీ తదితర సిబ్బంది కూడి క్రమ శిక్షణాత్మకంగా కవాతు నిర్వహించారు. పట్టణ వీధులన్నీ చుట్టేస్తూ సాగిన ఈ కవాతు ద్వారా ఎన్నికల నేపథ్యంలో ఏ విధమైన అసాంఘిక చర్యలనైనా కఠినంగా ఎదుర్కొంటామనే సందేశాన్ని పోలీసులు పంపారు. ఓటర్లు ఎవరి ఒత్తిడి లేకుండా తమ ఓటును వినియోగించుకోవచ్చు. చట్టవ్యవస్థను భద్రపరచడం మా బాధ్యత. ఎలాంటి అప్రతికూల పరిస్థితులను సహించమని ఈ సందర్భంగా డిఎస్పి రవీందర్ రెడ్డి స్పష్టం చేశారు. మణుగూరులో ఎన్నికల సందర్భంగా పోలీసులు జాగ్రత్తలు మరింత కట్టుదిట్టం చేస్తూ, ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా శక్తి ప్రదర్శన నిర్వహించారు.

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: ఏసీపీ వసుంధర యాదవ్



**చింతకాని , మహా:** ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామం ఎన్నికలలో సర్పంచ్ గా పోటీ చేస్తున్న అభ్యర్థులకు స్థానిక ప్రజలకు, రాజకీయ నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ అభ్యర్థులందరూ సామరస్య పూర్వకంగా ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాలని కోరారు. ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. నియమ నిబంధనలు పాటించకపోతే కేసులు సైతం నమోదు అవుతాయని తెలిపారు. అభ్యర్థులందరూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు జరుపుకోవాలని, ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసులు సూచించిన సమయంలోనే సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఎన్నికలు, ఫలితాల అనంతరం ఎలాంటి ర్యాలీలు గాని సమావేశాలకు గాని అనుమతి లేదని, ఇది గమనించి అందరూ సహకరించాలని అన్నారు. సమావేశంలో ఏసీపీ సాంబరాజు, సిఐ వెంకటప్రసాద్, ఎస్సై తదితరులు పాల్గొన్నారు.

# హోరా-హోరీగా పంచాయతీ పోరు

**త్రిముఖ పోటీలో ప్రచార జోష్.. ప్రత్యక్ష ప్రచారంలో తుళ్లూరి, పాయం, రేగా**





**మణుగూరు, మహా:** భద్రాద్రీ కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితి సింగారం పంచాయతీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వార్డుల్లో కుదిరిన రాజకీయ పొత్తులు సర్పంచ్ స్థాయికి రావడంతో ఒక్కసారిగా తారుమారయ్యాయి. కాంగ్రెస్–టిడిపి–బిఆర్ఎస్‌ల త్రిముఖ పోరు ఓటర్లను గందరగోళానికి గురిచేస్తుండగా, మూడు పార్టీల కీలక నేతలు బహిరంగ ప్రదర్శనగా ప్రచార రంగంలో జోష్ ను జోడిస్తున్నారు.

### కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు ఎమ్మెల్యే పాయం దూకుడు

సమితి సింగారం పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కలబోయిన మాధవరావు బ్యాట్ గుర్తు తోపాటు 7, 8, 9వ వార్డుల అభ్యర్థులకు మద్దతుగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇంటింటికి తిరిగి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీలతో గెలిపించండి అంటూ ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పిరునాకి నవీన్, శివ సైదులు, కూచిపూడి బాబు, కాటబోయిన నాగేశ్వరరావు, రహీం భాష తదితర కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### టిడిపి అభ్యర్థి భారతిని గెలిపించండి: తుళ్లూరు బ్రహ్మయ్య..

ఇక మరోవైపు కాంగ్రెస్‌కు చెందిన డీసీసీబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, గత శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ఈసారి టిడిపి సర్పంచ్ అభ్యర్థి బచ్చల భారతికి బలం అయ్యారు. కాంగ్రెస్–టిడిపి శ్రేణులు కలిసి నిర్వహించిన ప్రచారంలో ఆయనతో పాటు గురజాల గోపి, కేవీ రావు, పుచ్చకాయల శంకర్, వట్టం నారాయణదొర, లోకేష్, కమరున్నిసా బేగం, పురిటి విజయలక్ష్మి, మేదరమెట్ల నాగేశ్వరరావు, శీలం రామకృష్ణ, మానుకొండ రఘురాం, షబానా సౌజన్య తదితరులు పాల్గొన్నారు. రేణుక చౌదరి వర్గం కాంగ్రెస్ నాయకులు గురజాల గోపి తో పాటు అనుసర వర్గం టిడిపి అభ్యర్థి గెలుపును కాక్షిస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో వార్డుల్లో టిడిపి తరపున ఇంటింటి ప్రచారం జోరందుకుంది.

### బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకు మాజీ ఎమ్మెల్యే రేగా ప్రచారం..

బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి గుండి గౌరీకు మద్దతు కూడగట్టేందుకు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు రంగంలోకి దిగారు. ఆయన వెంట పార్టీలో చేరిన వార్డు సభ్యులు, స్థానిక శ్రేణులు ఉన్నారు. పోషం నరసింహారావు, కుర్రి నాగేశ్వరరావు, అడపా అప్పారావు, మౌలానా, నుకారపు రమేష్ లతో కలిసి పంచాయతీ వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించారు. గెలుపు ఖాయమని బిఆర్ఎస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

### ఎవరు గెలుస్తారు..? ఓటర్లే నిర్ణయాధికారులు..

**మూడు పార్టీలకు ముగ్గురు శక్తివంతమైన అభ్యర్థులు ప్రచార వేదికలపై మూడు గ్రూపుల ప్రభావం నాయకుల తెగువ, అనుచర వర్గాల మధ్య మారుతున్న పొత్తులు మొత్తంగా కలిసి సమితి సింగారంలో రాజకీయ పరిస్థితిని రసవత్తరంగా మార్చాయి. ఎమ్మెల్యే పాయం, డీసీసీబి డైరెక్టర్ తుళ్లూరి, మాజీ ఎమ్మెల్యే రేగా.. ఈ ముగ్గురు బలపరిచిన అభ్యర్థుల మధ్య తుది పోరు ఆసక్తికరంగా మారింది. ఈ ఉత్కంఠ పోరులో గెలుపు చివరికి ఎవరిదో ఓటర్ల తీర్పు వెలువడేంత వరకు వేచి చూడాల్సిందే.**

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం,మహా:** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గోడౌన్ లోపలి గోడలపై క్రాక్ లను చూసి, వర్షపు నీటికి చెమ్మ రాకుండా, తడి లేకుండా ఉండే విధంగా చూడాలని వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈవిఎంల భద్రత ముఖ్యమైనదని తెలిపారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు.

# కూరగాయల మార్కెట్‌లో గాల్లో లెక్కలు

# కనిపించని ధరల పట్టిక



**అశ్వారావుపేట,మహా:** అశ్వారావుపేట కూరగాయల మార్కెట్‌లో పారదర్శకత లేకపోవడం వినియోగదారులను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మార్కెట్‌లోని అనేక దుకాణాల్లో కూరగాయల ధరల పట్టిక కనిపించడంలేదు. రేట్లు ఎంత? అని అడిగితే కొంతమంది వ్యాపారులు అసహనంగా స్పందిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. కొనుగోలు చేసిన అన్ని కూరగాయలను కవర్‌లో వేసి, గాల్లో లెక్క వేసి, ఇంత అయ్యింది అని చెప్పే విధానంతో అమ్మకాలు సాగుతున్నాయి. ఏది ఎంత? ఎలా లెక్కపెట్టారు? అని అడిగితే... నీ దగ్గర ఎక్కువ తీసుకోములే%ా% ఎన్ని అనుమానాలు? అంటూ వ్యంగ్య సమాధానాలు ఇస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. ఒకే ఊళ్లో ఉన్న దుకాణాల్లోనే ఒకే కూరగాయకు పూర్తిగా భిన్నమైన ధరలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి ప్రజల్లో ఆగ్రహానికి దారితీస్తోంది. కూరగాయలు నిత్యవసరమైనవే. తప్పనిసరిగా వాడే వీటికి ధరలు స్పష్టంగా ప్రదర్శించకపోవడం ప్రజలను మరింత ఇబ్బందుల్లోకి నెట్టుతోంది.

### సామాన్యుల వేదన

రేట్లు స్పష్టంగా పెట్టడం అంత కష్టం కాదు. వినియోగదారుడికి తెలియకుండా ఉండాలనే ఉద్దేశ్యంతోనే ఇలా చేస్తున్నారు. ఎంత ఇచ్చామో, దేనికి ఇచ్చామో అర్థం కాకుండా పోతుంది. అని స్థానికులు వాపోతున్నారు.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

ధరల పట్టిక లేకుండా విక్రయం నిబంధనలకు విరుద్ధమని తెలిసినా మార్కెట్‌పై అధికారుల పర్యవేక్షణ కనిపించకపోవడంతో ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. నిత్యవసర వస్తువుల్లో పారదర్శకత తప్పనిసరి. అధికారుల చర్యలు లేకపోవడం వల్లే ఇష్టానుసార ధరలు కొనసాగుతున్నాయి అని స్థానికులు మండిపడుతున్నారు.

### వినియోగదారుల డిమాండ్

గాల్లో లెక్కలు కాదు ప్రతి కూరగాయ రేటును బోర్డు రూపంలో స్పష్టంగా ఏర్పాటు చేయాలి. మార్కెట్‌పై మున్సిపాలిటీ నియంత్రణ ఉంటే దోపిడీ తగ్గుతుంది. మార్కెట్‌లో ధరల ప్రదర్శన తప్పనిసరి చేస్తేనే వినియోగదారులు న్యాయమైన ధరకు కూరగాయలు కొనుగోలు చేసే అవకాశం లభిస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునిగా లక్ష్మ



**టేకులపల్లి - మహా:** జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వయో వృద్ధులు వికలాంగులు అభివృద్ధి అధికారి లేనినా జిల్లా విద్యా శాఖాదికారి నాగలక్ష్మి చేతులమీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయు అవార్డును అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవ వేడుకలో కలెక్టరు ఆదేశానుసారంగా టేకులపల్లి మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలయందు పనిచేస్తున్న దివ్యాంగ ఉపాధ్యాయుడు బాణోత్ లక్ష్మాకు సన్మానము చేసి అవార్డు అందించారు. అనంతరం బాణోత్ లక్ష్మా మాట్లడుతూ జిల్లా స్థాయిలో రెండవసారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కలెక్టరు కార్యాలయం యందు అందుకోవడం ఎంతో గర్వకారణం ఉందని , ఇంత పెద్దా ఎత్తున సన్మానించి సత్కరించిన జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రెండవసారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం మరింత భాధ్యత పెంచిందాని ఇంకా ఎంతో ఉత్సాహంగా పనిచేస్తానని ఈ కార్యక్రమంలో జిల్లా భవిత కోర్డినేటర్ అధికారి సైదులు, కాంప్లెక్స్ మెరుగు శ్రీనివాస్ మెప్మ జిల్లా అధికారి, వికలాంగ ఉద్యోగ ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

## 1064 టోల్‌ఫ్రీతో అవినీతికి అడ్డుకట్ట




**ఖమ్మం,మహా:** 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకొని పోస్టర్ లను, అవినీతి నిర్మూలన నినాదంతో కూడిన క్యూ ఆర్ కోడ్ పోస్టర్ లను ఆవిష్కరించారు.



## ఆహ్లాదకరమైన వాతావరణమే మా ప్రాధాన్యం


**ఖమ్మం, మహా:** ఖమ్మం నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని, మెరుగైన జీవనశైలిని అందించే దిశగా నగరపాలక సంస్థ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 54వ డివిజన్‌లో నూతనంగా నిర్మిస్తున్న పార్క్ పనులను మున్సిపల్ కమిషనర్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులతో కలిసి ఆయన పార్క్ అభివృద్ధి పనుల పురోగతిని పర్యవేక్షించారు. ?ఈ సందర్భంగా పార్క్‌లో చేపడుతున్న మొక్కల పెంపకం, ఆకర్షణీయమైన ల్యాండ్‌స్కేపింగ్, సందర్శకుల కోసం ఏర్పాటు చేస్తున్న వాక్‌వేలు, ఓపెన్ జిమ్ పనుల నాణ్యతను కమిషనర్ నిశితంగా పరిశీలించారు. పార్కుకు వచ్చే ప్రజలకు సహజసిద్ధమైన ప్రకృతి ఒడిలో ఉన్న అనుభూతి కలిగేలా పార్క్ రూపకల్పన ఉండాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కేవలం నిర్మాణం మాత్రమే కాకుండా, ప్రజల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆయన సూచించారు. ?ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, భద్రత దృష్ట్యా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించారు. అలాగే, పార్క్‌లోని చెట్లు, మొక్కల సంరక్షణ కోసం నిరంతర నీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ?నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడం, ప్రజలను ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు ప్రోత్సహించడమే ఖమ్మం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని కమిషనర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అన్ని హంగులతో సిద్ధమవుతున్న ఈ పార్క్ త్వరలోనే అందుబాటులోకి రానుందని, ఇది స్థానిక నివాసితులకు విశ్రాంతికి, వ్యాయామం చేయడానికి, అలాగే కుటుంబంతో కలిసి సమయం గడపడానికి ఒక చక్కని వేదికగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తా

**నేలకొండపల్లి, మహా:** నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి పసుపులేటి శ్రీలత అన్నారు. మేజర్ పంచాయతీలో సోమవారం ఇంటింటా విస్రుతంగా ప్రచారం నిర్వహించారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ'ని రాష్ట్ర రెవిన్యూ, గృహా నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహాకారంతో పంచాయతీ ని అభివృద్ధి చేస్తానని అన్నారు. నేలకొండపల్లి పంచాయతీ ని అన్ని రకాలు గా అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని అన్నారు. స్థానిక ఆడబిడ్డ గా నేలకొండపల్లి లో ప్రజలు ఎదుర్కుంటున్న పలు సమస్యల ను దశల వారీగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. తన గెలుపు కోసం అహర్నిషలు శ్రమిస్తున్న కాంగ్రెస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయపూడి నవీన్, జెర్రిపోతుల అంజిని, వంగవీటి నాగేశ్వరరావు, బొడ్డు బొందయ్య, యం. వెంకన్న, జెర్రిపోతుల సత్యనారాయణ, మైశా శంకర్, కడియాల నరేష్, మద్దినేని మహేష్, పావులూరి వెంకటేశ్వర్లు, అక్కినేని నాగేశ్వరరావు, గుడిపాటి ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.



## పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థను బలంగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయి



**ఖమ్మం,మహా:** గ్రానైట్ రంగం నిలబడితే వేల కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని, త్వరలోనే పరిశ్రమ ప్రతినిధులతో విస్తృత సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం స్థానిక ఖానాపురం లోని ఇండస్ట్రియల్ కాలనీ గ్రానైట్ పారిశ్రామిక ప్రాంతాన్ని కలెక్టర్ సందర్శించి పరిశ్రమల స్థితిగతులను, పరిస్థితులను క్షేత్రస్థాయిలో తిరుగుతూ పరిశీలించారు. పలు గ్రానైట్ యూనిట్లలో జరుగుతున్న ఉత్పత్తి, ప్రాసెసింగ్ పనులపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. యూనిట్ నిర్వాహకులు, పారిశ్రామిక వేత్తలు, కార్మికులతో కలెక్టర్ సంభాషిస్తూ పరిశ్రమ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీశారు. విద్యుత్ ఛార్జీలు, ఎగుమతి సమస్యలు, మార్కెట్ డిమాండ్ తగ్గుదల, ముడి సామగ్రి రవాణా వ్యయాల పెరుగుదల వంటి పలు అంశాలపై కలెక్టర్ వివరాలు సేకరించారు.

# శాంతియుత వాతావరణంలో ఓటు వినియోగించుకోవాలి

## అలజడి సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు: డి.ఎస్.పి సతీష్ కుమార్

**బూర్గంపహాడ్ మహా:** ఈనెల 11వ తేదీన జరగనున్న స్థానిక ఎన్నికల్లో శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డి.ఎస్.పి సతీష్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల తో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని 5 గంటల తరువాత నుండి ఎటువంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించవద్దని సూచించారు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే సమయంలో సెల్ ఫోన్ వాటర్ బాటిల్ లాంటివి తీసుకెళ్లరాదని తెలియజేశారు. 100 మీటర్ల పరిధిలో కి అనుమతి లేని వ్యక్తులకు ప్రవేశం లేదని తెలియజేశారు. శాంతియుద్ధ వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులకు సహకరించాలని అలజడి సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైనా ఘర్షణలకు దిగుతున్నట్లు అనిపిస్తే 100 కి లేదా స్థానిక ఎస్సై పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేశారు. ఎన్నికల సమయంలో కూడా ఎన్నికల కోడ్ ప్రకారం కేసు నమోదు అయితే పాత కేసులు ఉన్న వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తాం లేదా



బైండోవర్ చేయడం జరుగుతుందని సూచించారు. ఎటువంటి గొడవలకు అవకాశం ఇవ్వకుండా స్థానిక ఎన్నికలను సోదరభావంతో నిర్వహించుకోవాలని కోరారు. తాసిల్దార్ కె ఆర్ కె ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి లు మాట్లాడుతూ 11వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మాత్రమే పోలింగ్ జరుగుతుందని తెలియజేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి అదే పోలింగ్ కేంద్రంలో కౌంటింగ్ నిర్వహిస్తామని సాయంత్రం 5 గంటల లోపు పూర్తిస్థాయి ఫలితాలు ఆయా కేంద్రాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలలో వెల్లడిస్తామని తెలిపారు. ప్రతి ఒక్క ఓటర్ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్ ఐడి లేదా బిఎల్వోలు అందించిన ఓటర్ స్లిప్పులను తీసుకెళ్లాలని తెలిపారు. వృద్ధులకు వికలాంగులకు అధికారులు 100 మీటర్ల పరిధిలో నుంచి సంబంధిత బి ఎల్ ఓ లు సహకారంతో వీల్ చైర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అధికారులకు బదిలీ ఉంటుంది గ్రామస్తులు ఎప్పటికీ గ్రామంలోనే ఉండాలి ఈ విషయాన్ని గ్రహించి స్నేహపూర్వకంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులకు సహకరించాలని కోరారు. ఘర్షణలకు పాల్పడిన వారిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేస్తారనేది విషయాన్ని మరచిపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై మేడాప్రసాద్, అదనపు ఎస్సై నాగబిక్షం, ట్రైన్ ఎస్సై ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాధికారిని కలిసిన టిఎస్ యుటిఎఫ్ బూర్గంపాడు మండల నూతన కమిటీ



**బూర్గంపహాడ్ మహా:** ఇటీవల జరిగిన బూర్గంపాడు మండల టీఎస్ యూటీఎఫ్ మహాసభలో మండల అధ్యక్షులుగా ఎన్నికైన శ్రీ బి. బాలు, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎం. సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన శ్రీ తేజావత్ రమేష్, మహిళా ఉపాధ్యక్షురాలుగా శ్రీమతి పి. ఉమాదేవి, కోశాధికారిగా శ్రీ డిపి రామకృష్ణ. మహిళా కార్యదర్శిగా శ్రీమతిఎంజే విజయశ్రీ, మహిళా కన్వీనర్ గా శ్రీమతి బి అనిత, ఎఫ్ డబ్ల్యు ఎఫ్ కన్వీనర్ గా శ్రీ సిహెచ్ శ్రీనివాస్, ఆడిటర్ గా శ్రీ బి.శివరాం, కార్యదర్శులుగా ఎస్ జనార్దన్ టీవీఎస్ ప్రసాద్ ఎం శేషాచార్యులు పి సత్యనారాయణ జె స్వర్ణకుమారి ఎన్నిక కాగా నూతన కమిటీతో కూడిన లిస్టును మండల విద్యాధికారి శ్రీ యదు సింహరాజు గారికి అందించి, పరిచయం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి నూతన కమిటీ వారికి శుభాభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో క్రియాశీలమైన పాత్ర వహిస్తూ పని చేస్తామని నూతన అధ్యక్ష కార్యదర్శులు తెలియజేశారు.

## పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** పంచాయతీ ఎన్నికల సంపూర్ణ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన చండుగొండ మండలంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్.ఓలు, ఏఈఓలతో సమావేశమై ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నియమ నిబంధనలకు అనుగుణంగా అమలు చేయాలని ఎటువంటి నిర్లక్ష్యం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు నిర్వహిస్తున్న రికార్డులను విపులంగా పరిశీలించిన ఆయన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది నుండి పోస్టల్ బ్యాలెట్ జారీ చేసే సమయంలో ఫారం-17, డ్యూటీ ఆర్డర్ కాపీని తప్పనిసరిగా పరిశీలించాలని పోస్టల్ బ్యాలెట్ వెనుక రిటర్నింగ్ అధికారి సంతకం స్పష్టంగా ఉండాలని అదే లేకపోతే ఆ ఓటు చెల్లదని స్పష్టం చేశారు. అదేవిధంగా బ్యాలెట్ బాక్సులు పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రాలలో ఏర్పాటు చేయాల్సిన వసతులు పోలింగ్ సిబ్బందికి అందించాల్సిన భోజన ఏర్పాట్లు రూట్‌వారిగా మెటీరియల్ పంపిణీ రవాణా ప్రణాళికలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## దిక్కు లేని వారికి వణికే చలిలో రగ్గులు అందజేత

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఐక్య తల్లిదండ్రుల సంఘం, ఎస్ జీ ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రాత్రి భద్రాద్రి కొత్త గూడెం జిల్లా కేంద్రంలో దిక్కు మొక్కు లేని వారికి వణికించే చలిలో రగ్గులు అందజేశారు. యూ పీ ఏ రాష్ట్ర అధ్యక్షులు మారుతి రత్నాకర్, ఎస్ జీ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లోగాని శ్రీనివాస్ సారథ్యంలో దివంగత కొప్పుల పోలిరెడ్డి, సామ్రాజ్యం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు కొప్పుల శ్రీనివాసరెడ్డి, హైమావతి దంపతులు సహకారంతో చలికి వణుకుతున్న అభాగ్యులకు, ఫుట్ పాత్ పై, బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతం లో నిద్రించే వీధిభిక్షకులకు రగ్గులు వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీ.లతా రవిచంద్ర, కోటేశ్వరరావు, కొప్పులశ్రీ భవ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రోజు మోహన్, ఏటీఈసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నేమిల్ల రమేష్, ఎస్ జీ ఎఫ్ ఉమెన్స్ గిల్డ్ జిల్లా కమిటీ సభ్యురాలు అంజమ్మ, చుంచుపల్లి మండల ప్రధాన కార్యదర్శి నీరుకొండ మాలతి, జిల్లా ఉపాధ్యక్షుడు బీర రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి కృషి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు ఐ.డి.ఓ.సి మీటింగ్ హాల్ నందు జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనినా అధ్యక్షతన సోమవారం నిర్వహించడం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు యుడిఐడి కార్డులు పొందాలని తెలియచేశారు. గతంలో పొందిన యు.డి.ఐ.డి. కార్డుల సవరణలు పోర్టల్ ద్వారా చేసుకోవచ్చని జిల్లాలో దివ్యాంగుల డ్వాక్రా సంఘాలుగా తయారయి పొదుపు చేసి రుణాలు పొందవచ్చని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఇన్సూరెన్స్ పథకాలను పొందాలని దివ్యాంగులు ఎలాంటి సమస్యలు ఉన్న తమను సంప్రదిస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతి మండలంలో భవిత సెంటర్లు ఏర్పాటు చేశామనీ ప్రత్యేక అవసరత కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ స్పీచ్ థెరపీ అందిస్తున్నామని వారిలో నైపుణ్యాన్ని వెలికి తీస్తున్నామని భవిత సెంటర్లను అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దామని ఈ సౌకర్యాలు ప్రత్యేక అవసరత ఉన్న పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని



తెలిపారు. వీరి కోసం ఐ.ఈ.డి. కోఆర్డినేటర్స్ మండలాల వారిగా పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారిణి మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగులకు తమ శాఖ ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు అయినటువంటి వివాహ ప్రోత్సాహక బహుమతి, దివ్యాంగులను సకలంగులు లేదా దివ్యాంగులను దివ్యాంగులు వివాహం చేసుకున్న వారికి లక్ష రూపాయలు ప్రోత్సాహక బహుమతికి అర్హులని టీజీ ఈపాస్ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేయాలని ప్రీమెట్రిక్ పోస్టుమాటిక్స్ స్కాలర్షిప్లు కొరకు ఒకటి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్కాలర్షిప్లు మంజూరు చేస్తామని తెలిపారు. టీజీ ఈపాస్ ద్వారా పోస్ట్మెట్రిక్ స్కాలర్షిప్ల కొరకు దరఖాస్తు చేయాలని స్వయం ఉపాధి పథకం ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నామని వాటిని టీజీ ఓబి ఎంఎంఎస్ నందు వెబ్సైట్ నందు నోటిఫికేషన్ వెలువడినప్పుడే ఆన్లై ఆన్లైన్ లో దరఖాస్తు చేయాలని సహాయ ఉపకరణాల కొరకు కూడా టీజీ ఓబి ఎంఎంఎస్ వెబ్సైట్ నందు నోటిఫికేషన్ వెలువడినప్పుడే దరఖాస్తు చేయాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని తెలిపారు. వికాసం ప్రత్యేక పాఠశాల బధిర విద్యార్థులు వేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులు విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగింది. వివిధ రంగాలలో దివ్యాంగుల కొరకు సేవలు అందిస్తున్న వారికి, అసోసియేషన్ సభ్యులకు, ఎం.ఈ.జి.ఆర్.ఎస్., సెర్ప్ సిబ్బందిని, ప్రభుత్వ శాఖలలో వివిధ హోదాలలో పనిచేస్తున్న సిబ్బందిని మొత్తం 120 మందిని మెమెంటో, శాల్వాలతో సన్మానించడం జరిగింది.



# ఖమ్మం 'కిక్కు'పై ఎలక్షన్ బ్రేక్

**ఖమ్మం బ్యూరో, మహా:** రాజకీయ చైతన్యానికి మారుపేరైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పుడు విచిత్రమైన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ ఎన్నికల వేడి తారాస్థాయికి చేరిన వేళ, మందు బాబుల గొంతు తడిపే 'కిక్కు'కు మాత్రం బ్రేక్ పడింది. సాధారణంగా ఎన్నికలంటేనే మందు, విందు జోరుగా సాగుతాయని అందరూ భావిస్తారు. కానీ, ఎన్నికల సంఘం తీసుకున్న కఠిన నిర్ణయంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మద్యం ప్రియులకు నిరాశే మిగిలింది. రేపటి (డిసెంబర్ 9) నుంచి ప్రారంభం కానున్న ఈ 'డ్రై డేస్' ప్రభావం కేవలం మందు బాబులపైన మాత్రమే కాదు, జిల్లా ఆర్థిక ముఖచిత్రంపైన, ప్రభుత్వ ఆదాయంపైన తీవ్ర ప్రభావం చూపనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం సుమారు 177 వైన్ షాపులు (ఎ 4 లైసెన్స్), 38 బార్లు, రెస్టారెంట్లు (2బి లైసెన్స్) కొనసాగుతున్నాయి. ఇందులో ఖమ్మం జిల్లా పరిధిలో సుమారు 90కి పైగా వైన్ షాపులు ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 85కి పైగా షాపులు ఉన్నాయి. ఇక బార్ల విషయానికి వస్తే ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనే అత్యధిక బార్లు ఉండటం గమనార్హం. సాధారణ రోజుల్లోనే ఈ రెండు జిల్లాల నుంచి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ఎక్సైజ్ శాఖకు ఒక కల్పతరువు లాంటిది. సింగరేణి ప్రాంతం, పారిశ్రామిక వాడలు, ఏజెన్సీ ప్రాంతాలు ఉండటంతో ఇక్కడ మద్యం వినియోగం సహజంగానే మిగిలిన జిల్లాల కంటే కాస్త ఎక్కువగా ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఉన్న మరో ప్రత్యేకత ఆంధ్రా సరిహద్దు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, భద్రాచలం వంటి ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆనుకుని ఉన్నాయి. తెలంగాణలో షాపులు బంద్ పాటిస్తుండటంతో, మందు బాబులు సరిహద్దు దాటి ఏపీకి వెళ్లి మద్యం తెచ్చుకునే ప్రమాదం ఉంది. లేదా అక్కడి నుంచి అక్రమంగా మద్యం జిల్లాలోకి రవాణా అయ్యే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఖమ్మం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అప్రమత్తమయ్యారు. సరిహద్దుల్లోని చెక్ పోస్టుల వద్ద నిఘాను తీవ్రతరం చేశారు. ఆంధ్రా నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి నిల్వ ఉంచిన మద్యాన్ని, బెల్టు షాపుల ద్వారా విక్రయించే ప్రయత్నాలను అడ్డుకోవడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దించారు. మొత్తానికి గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మందు బాబులకు, మద్యం వ్యాపారులకు ఒక చేదు అనుభవాన్ని మిగిల్చాయి. ప్రజాస్వామ్య ప్రక్రియను సజావుగా సాగించడానికి, గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడటానికి వందల కోట్ల ఆదాయాన్ని వదులుకోవడానికి కూడా ప్రభుత్వం సిద్ధపడింది. డిసెంబర్ 17న చివరి విడత ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఖమ్మం జిల్లాలో మద్యం దొరకడం కష్టమే. అప్పటి వరకు మందు బాబులు తమ 'కిక్కు'ను పక్కనపెట్టి, ప్రజాస్వామ్య విజయం కోసం ఎదురుచూడక తప్పదు.

### ఆదాయానికి భారీ గండి

సాధారణ రోజుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సగటున రోజుకు 6 నుండి 8 కోట్ల రూపాయల వరకు మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. వారాంతాల్లో లేదా పండుగ రోజుల్లో ఈ మొత్తం 10 కోట్ల రూపాయల వరకు చేరుతుంది. ఇక ఎన్నికల సీజన్ అంటే ఈ డిమాండ్ అమాంతం పెరిగిపోయి, రోజుకు 12 నుండి 15 కోట్ల రూపాయల వరకు వ్యాపారం జరిగే అవకాశం ఉంటుంది. కానీ, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మూడు విడతల్లో విధించిన నిషేధం ఈ ఆదాయానికి గండి కొట్టింది. డిసెంబర్ 9 నుండి 17 వరకు వివిధ మండలాల్లో విడతల వారీగా వైన్ షాపులు మూతపడనున్నాయి. ఒక్కో విడతలో ఎన్నికలకు 48 గంటల ముందు నుంచే అమ్మకాలు నిలిపివేయడం వల్ల, సగటున ఒక్కో షాపు దాదాపు 6 నుండి 8 రోజుల పాటు వ్యాపారాన్ని కోల్పోనుంది. ఎన్నికల సీజన్ లో జరగాల్సిన విపరీతమైన అమ్మకాలను కోల్పోవడం వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్సైజ్ శాఖకు దాదాపు 60 నుండి 70 కోట్ల రూపాయల మేర ఆదాయ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. బార్లు కూడా మూతపడటం, రెస్టారెంట్లలో మద్యం సరఫరా నిలిచిపోవడం వల్ల దీనికి అనుబంధంగా వచ్చే ఇతర పన్నుల ఆదాయం కూడా భారీగానే తగ్గుతుంది. వ్యాపారులు స్టాక్ నింపి పెట్టుకున్నా, అమ్మడానికి వీలు లేకపోవడంతో వారు లబోదిబోమంటున్నారు.

## పంచాయతీ ఎన్నికల సందర్భంగా సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు



**ఖమ్మం, మహా:** పంచాయతీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వాణిజ్య సంస్థ, దుకాణం, వ్యాపార సంస్థలలో పనిచేసే కార్మికులకు పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం తెలిపారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి దశ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో పోలింగ్ కోసం ఉపయోగిస్తున్న కార్యాలయ, విద్యా సంస్థల భవనంలో ఉన్న సిబ్బందికి, విద్యార్థులకు ఎన్నికల ముందు రోజు డిసెంబర్ 10న, అలాగే రెండవ దశ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో డిసెంబర్ 13న, మూడో దశ పోలింగ్ జరిగే ప్రాంతాల్లో డిసెంబర్ 16న లోకల్ హాలిడే, ఎన్నికల రోజున ఎన్నికలు జరిగే ప్రాంతాలలో స్థానికంగా సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. దుకాణ, వాణిజ్య సంస్థల యజమానులకు, వ్యాపార సంస్థల యజమానులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల సందర్భంగా తమ దుకాణ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పని చేయుచున్న కార్మికులకు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులకు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకం



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీరామ్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల సూక్ష్మ పరిశీలకుల(మైక్రో అబ్జర్వర్ల) శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీరామ్ పాల్గొని ప్రసంగించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిష్పాక్షికంగా నిర్వహించడంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. మూడువిడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. పోలింగ్‌కు ఒక రోజు ముందుగానే మైక్రో అబ్జర్వర్లు తమ తమ పోలింగ్ స్టేషన్లకు చేరుకుని ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు. పోలింగ్ ప్రారంభానికి ముందు పోలింగ్ సమయంలో పోలింగ్ ముగిసిన తరువాత ప్రతి దశలోనూ సూక్ష్మంగా పరిశీలించి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి అంశాన్ని నిశితంగా గమనించి ఎన్నికల నియమావళి ఖచ్చితంగా అమలవుతున్నదేనా అనే విషయాన్ని అంచనా వేసి తగిన నివేదికను సాధారణ పరిశీలకులకు సమర్పించాలని శ్రీరామ్ ఆదేశించారు. ఎలాంటి అనుచిత చర్యలు నిబంధనల ఉల్లంఘనలు గమనించిన వెంటనే సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో స్వేచ్ఛా నిష్పాక్షిక పారదర్శక ఎన్నికల నిర్వహణకు సూక్ష్మ పరిశీలకుల సేవలు అత్యంత ముఖ్యమైనవని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సాయి కృష్ణ, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎలివేటెడ్ షెడ్ల వల్ల జీవాల్లో అంటురోగాలు నివారించవచ్చు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఎలివేటెడ్ షెడ్ల వల్ల జీవాల్లో అంటురోగాలు నివారించవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. మద్దూకూరు గ్రామంలో రైతు తలారి రవి ఏర్పాటు చేసిన ఎలివేటెడ్ మేకలు గొర్రెల పెంపక షెడ్‌ను సోమవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలివేటెడ్ షెడ్ విధానం పశు సంవర్ధక రంగంలో ఆధునిక శాస్త్రీయ పద్ధతి అని ఈ విధానం ద్వారా జీవుల్లో అంటు వ్యాధులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల మరణాల శాతం ఈ విధానంతో స్పష్టంగా



తగ్గడం శుభపరిణామమని అన్నారు. ఎలివేటెడ్ ఫ్లోరింగ్ కారణంగా పేడ మూత్రం నేలపై నేరుగా పడిపోవడం వల్ల ఫ్లోర్ ఎప్పటికప్పుడు పొడి పరిశుభ్రంగా ఉంటుందని దీని వలన తడి లేకుండా శుభ్రమైన వాతావరణం ఏర్పడి జీవుల్లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు తగ్గుతాయి అని తెలిపారు. పరిశుభ్రత పెరగడం వల్ల జీవాలు ఆరోగ్యంగా పెరిగి పెరుగుదల శాతం కూడా గణనీయంగా మెరుగవుతుందని చెప్పారు. అలాగే రైతు తలారి రవి స్వయంగా రూపొందించిన గడ్డి కోసే యంత్రం ఫర్నిచర్ యూనిట్ ఫీడ్ మిక్సర్ వంటి వినూత్న ఆవిష్కరణలను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. గ్రామీణ స్థాయిలో రైతులు ఇలాంటి సృజనాత్మకతను ప్రదర్శించడం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు



### పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు

**పినపాక,మహా:** పోస్టల్ బ్యాలెట్ ఓటును ముఖ్యంగా సర్వీస్ ఓటర్లు (సైన్యం, పోలీసు సిబ్బంది) ఎన్నికల విధుల్లో ఉన్న ఓటర్లు వినియోగించుకుంటున్నారని పినపాక ఎంపీడీవో, జిల్లా ఎన్నికల సహాయ అధికారి సంకీర్త్ తెలిపారు. సోమవారం పినపాక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకుంటున్నట్లుగా తెలిపారు. ఈసీ నియమ నిబంధన ప్రకారం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లుగా తెలిపారు

### గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి



**పినపాక ,మహా:** పినపాక మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ వార్డ్ మెంబర్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం సాయంత్రం పినపాక మండలం ఉప్పాక,సీతంపేట గ్రామపంచాయతీలో పర్యటించి ప్రచారంలో పాల్గొన్నారు . కాంగ్రెస్ బల పరిచిన అభ్యర్థి బాబురావు, తోపాటు 8 వార్డుల్లో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు గుర్తుచేసుకొని ఓటు వేయాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### పొంగులేటి సహకారంతో బాధిత మహిళకు 5 లక్షల ఎల్ఓసి



**కారేపల్లి, మహా:** సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ లింగం బంజర కు చెందిన నజీమా షేక్ అనారోగ్యంతో బాధపడుతున్న క్రమంలో ఆమె వై ద్యం కోసం రాష్ట్ర సమాచార గృహ నిర్మాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఐదు లక్షల రూపాయలు కు సంబంధించి ఎల్ఓసిని సోమవారం అందజేశారు. బాధితురాలు బోన్ వ్యాధితో బాధపడుతూ శస్త్ర చికిత్స కోసం స్థానిక నాయకులు షేక్ సైదులు సహకారంతో మంత్రి పొంగులేటికి దరఖాస్తు పెట్టుకున్నారు. ఎల్ వో సి ఇప్పిచ్చినందుకుగాను బాధిత కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



# కొబ్బరి పీచు వాహనంలో రూ.కోటి గంజాయి

**మహా,భద్రాద్రి కొత్తగూడెం(భద్రాచలం):** గుట్టచప్పుడు కాకుండా తరలిస్తున్న సుమారు కోటి రూపాయల విలువ గల గంజాయిని భద్రాచలం పోలీస్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. సుమారు కోటి రూపాయల పైన విలువ గల గంజాయిని సమయస్ఫూర్తితో పట్టుకున్న అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్, భద్రాచలం ఏఎస్పీ విక్రమ్ సింగ్ కుమార్ ఐఏఎస్ అభినందించారు. సోమవారం భద్రాచలం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఘటనకు సంబంధించిన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆదివారం సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో %ా×% సతీష్ తన సిబ్బందితో కూనవరం రోడ్డు ప్రాంతంలో వాహన తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో కూనవరం నుండి భద్రాచలం వైపుగా వస్తున్న అశోక్ లైలాండ్ వాహనం కొంత దూరంలో పోలీస్ వారిని చూసి వాహనాన్ని వెనుకకు మళ్ళించి తప్పించుకొని పారిపోయే ప్రయత్నం చేయడాన్ని గమనించిన పోలీసులు, అట్టి వాహనాన్ని కొంత దూరం వెంబడించి పట్టుకున్నారు. అట్టి వాహనాన్ని ఆఫీసు వద్దకు తీసుకొని వంంచ్చి వెలుతురులో తనిఖీ చేయగా, అందులో 110 ప్రభుత్వ నిషేధిత గంజాయి ప్యాకెట్లను తరలిస్తున్నట్లు గుర్తించి, వాహనంలో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో పట్టుబడిన 110 ప్యాకెట్లలో సుమారుగా ఒక కోటి రూ:1,11,48,300/-ల విలువ గల 222.966 కేజీల ప్రభుత్వ నిషేధిత గంజాయిని గుర్తించి పంచనామా యుక్తంగా పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. పట్టుబడిన నలుగురు వ్యక్తులతో పాటు ఇట్టి గంజాయిని విక్రయించిన, కొనుగోలు చేస్తున్న వ్యక్తులపైకూడా కేసు నమోదు చేయడం జరిగిందని వారు తెలిపారు.



### తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే

**ఖమ్మం సిటీ, మహా:** తండాలను గ్రామ పంచాయతీ లు గా చేసిన ఘనత కేసీఆర్ దే నని, రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీలిపించి గ్రామాల అభివృద్ధి కి సహకరించాలని బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ కోరారు.రఘునాథ పాలెం మండల పరిధిలోని బద్యా తండా,పరికలబోడు తండా , ఈర్లపుడి,వంగిడి,కెవి బంజర తదితర గ్రామాల్లో పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థులు గా పోటీ చేస్తున్న పెంట్యా,బద్రు,అనసుర్య, సోలీ,సరిత ల విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ మండల అధ్యక్షులు వీరూ నాయక్ తో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో కృష్ణ మట్లాడుతూ గ్రామాలలో బిఆర్ ఎస్ హయాంలో రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఏమి జరగలేదన్నారు.ఆనాడు గ్రామాల్లో సీసీ రోడ్లు,మిషన్ భగీరథ ద్వారా మంచినీరు, పల్లె ప్రకృతి, రైతు వేదికలు, స్మశాన వాటికలు తో పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు.మండలంలోని గ్రామాలు మరింత అభివృద్ధి చెందేందుకు బిఆర్ఎస్ మద్దతు ప్రకటించిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు.అనంతరం ఈర్లపూడి గ్రామంలో మాజీ ఎం.ఎల్. ఏ.మదన్ లాల్ వదిన బానోత్ కళావతి ని కలిసి ఎన్నికల పై చర్చించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రవి,మనోహర్ రెడ్డి రవిప్రకాష్,జాన,సంజీవరావు, చిన,రవి,రాజా,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి జిఎం పర్సనల్ అధికారులతో సమీక్ష

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి సంస్థ సిఎండి ఎన్.బలరామ్, డైరక్టర్(పా)గౌతమ్ పోట్రు ఆదేశాల మేరకు కొత్తగూడెం రీజియన్ లోని కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ల అధికారులతో సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జిఎం(పర్సనల్)కవితా నాయుడు సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా కవితా నాయుడు ఏరియాల వారిగా 2024 సంవత్సరానికి గాను గుర్తించబడిన దీర్ఘకాలిక గైర్హాజరైన ఉద్యోగులపై తీసుకున్న క్రమశిక్షణాచర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గైర్హాజరు కాకుండా ఇతర కారణాల ద్వారా గుర్తించబడిన కేసులలో తీసుకున్న క్రమశిక్షణాచర్యల గురించి కాంట్రాక్టర్లు కాంట్రాక్టు కార్మికులను ఈఎస్ఐ వెబ్ పోర్టల్ నందు నమోదు చేసే ప్రక్రియ కాంట్రాక్టు కార్మికులు కార్పొరేట్ బ్యాంక్ సాలరీ ప్యాకేజీ అకౌంట్స్ కు మారుట, 2025 సంవత్సరానికి గాను ఇవ్వవలసిన పదోన్నతుల స్థితి ఏరియాలో ఉన్న ఇతర ఖాళీల భర్తీకి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు, ఈపిఆర్ నందు ఉద్యోగి జీవిత భాగస్వామి కుటుంబ సభ్యుల యొక్క పూర్తి వివరాలను నమోదు చేయటం మొదలైన అంశాలపై ఏరియాల వారీగా సంబంధిత ఏరియా పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులతో సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం(పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, డిజిఎం(పర్సనల్)లు ఎస్.వేంకటేశ్వర రావు, బి.రాజగోపాల్, ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు జి.వి.మోహన్ రావు, ఎస్.రమేష్, ఏ.తుకారాం, శ్యామ్ ప్రసాద్ లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.





## ఐటీసీ ప్లాంట్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటీసీ పిఎస్పీడీ భద్రాచలం యూనిట్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం సందర్శించారు. యూనిట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లో అమలు చేస్తున్న ఆధునిక భద్రతా ప్రమాణాలు, ఎనర్జీ ఎఫిషియెన్సీ చర్యలు, అలాగే యంత్రాంగ పనితీరును మెరుగుపరచడంతో పాటు బ్రేక్‌డౌన్‌లను తగ్గించేందుకు చేపట్టిన టిపిఎం (టోటల్ ప్రొడక్టివ్ మెయింటెనెన్స్) విధానం గురించి కలెక్టర్‌కు విపులంగా వివరించారు.ప్రాసెస్ కంట్రోల్ వ్యవస్థలు ఉత్పత్తి ప్రతి దశలో ఎలా ఖచ్చితత్వం, నాణ్యత, ఆపరేషనల్ నమ్మకాన్ని నిర్ధారిస్తున్నాయో మేనేజ్‌మెంట్ ప్రెజెంటేషన్ రూపంలో తెలియజేసింది. పేపర్ బోర్డు తయారీ ప్రక్రియలో వినియోగిస్తున్న ఆధునిక యంత్రాంగం, ఆటోమేషన్ టెక్నాలజీ, పర్యావరణ హిత తయారీ విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్శన ద్వారా ఐటీసీ పి ఎస్ పి డి యూనిట్‌లో భద్రత, టిపిఎం ఆధారిత సామర్థ్యవృద్ధి, పర్యావరణానుకూల ఉత్పత్తి విధానాలపై ఉన్న నిబద్ధతను జిల్లా పరిపాలన మరింత సమగ్రంగా అవగాహన చేసుకుంది. ప్లాంట్ కార్యకలాపాలలో నాణ్యత, భద్రత, పారిశ్రామిక ప్రమాణాల అమలుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిసి యూనిట్ హెడ్ శైలేందర్ కుమార్ సింగ్, పేపర్ బోర్డ్ హెడ్ రాంబాబు, హ్యూమన్ రిసోర్సెస్ హెడ్ పి. శ్యామ్ కిరణ్, అడ్మిన్ హెడ్ చెంగల్ రావు తదితర సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే పరమావధి

- విధుల్లో అలసత్వం వద్దు
- సికిల్ సెల్ బాధితులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి
- ఆసుపత్రుల్లో డీఎంహెచ్‌వో సుడిగాలి పర్యటన

**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరంలోని బస్తీ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా వైద్య , ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.రామారావు రంగంలోకి దిగారు. సోమవారం ఆయన నగరంలోని పలు ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా వైద్య , ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.రామారావు నగరంలోని పాండురంగాపురం బస్తీ దవాఖానను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎం.అనిరుధ్, నర్సింగ్ ఆఫీసర్ శ్రీలత, సపోర్టింగ్ స్టాఫ్ శ్రీహరి హాజరు పట్టికను ఆయన స్వయంగా పరిశీలించారు. బస్తీ దవాఖానాలు కేవలం ప్రజలకు సేవ చేయడానికే ఏర్పాటు చేయబడ్డాయని గుర్తుచేస్తూ, ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించని వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యను పెంచేలా చర్యలు



తీసుకోవాలని, ప్రజలకు ఆసుపత్రి సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను గుర్తించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ రామారావు ఆదేశించారు. గుర్తించిన బాధితుల వివరాలను వెంటనే పోర్టల్‌లో నమోదు చేయాలని, వారికి ప్రతినెలా క్రమం తప్పకుండా అవసరమైన మందులను అందజేయాలని స్పష్టం చేశారు. అనంతరం దవాఖానలోని ఓ.పి, ల్యాబ్, ఏ.ఎన్.సి, డ్రగ్ స్టాక్, మెడిసిన్ ఇండెంట్, ఐ.పి మరియు రెఫరల్ రిజిస్టర్లను ఆయన క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు మరియు రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ మరియు ఆఫ్ లైన్ విధానంలో అప్ డేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పాండురంగాపురం పర్యటన అనంతరం డీఎంహెచ్‌వో మామిళ్లగూడెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ను సందర్శించారు. అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, లేబొరేటరీ పరీక్షలు, అవుట్ పేషెంట్ సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ చైతన్యకు, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీఫణికి విధుల్లో పాటించాల్సిన మెలకువలపై పలు సూచనలు చేశారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన, సమయానుకూలమైన ఆరోగ్య సేవలు అందుతాయని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ రామారావు పిలుపునిచ్చారు.

# మీ బిడ్డగా వస్తున్న.. సర్పంచ్‌గా ఆశీర్వదించండి







**దంతాలపల్లి, మహా:** మీ బిడ్డ గా వస్తున్న... నన్ను ఆశీర్వదించండి అని మండల పరిధి అగపేట గ్రామపంచాయతీ బరిలో నిలిచిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కొత్త యాకన్న అగపేట ఓటరు మహాశయులను కోరారు.ఆయన మహా పత్రిక ప్రతినిధి ఇంటర్వ్యూ లో ప్రత్యేకంగా మాట్లాడారు. డోర్నకల్ నియోజకవర్గ ముద్దు బిడ్డ,ఎమ్మెల్యే డాక్టర్. రామచంద్రు నాయక్ ఆశీర్వాదం తో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గా బరిలోకి దిగుతున్నానని... సీఎం రేవంత్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత పాలకుల చేతిలో అనేక విధాలుగా గోసపడ్డ అగపేట గ్రామపంచాయతీ ప్రజల కష్టాలు తీర్చడానికి సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగానన్నారు. తనకంటూ ప్రత్యేక మేనిఫెస్టో ఏమీ లేదని... ప్రజా పాలన ప్రభుత్వ అందిస్తున్న పథకాలు అసలైన లబ్ధిదారులకు అందేలా చూడడమే తన లక్ష్యమని తెలిపారు. తనను సర్పంచ్ గా గెలిపిస్తే ఎమ్మెల్యే రామచంద్రనాయక్ ఆశీస్సులతో ఆగ పేట గ్రామపంచాయతీ అభివృద్ధికి నిధులు తీసుకురావడమే కాకుండా, అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజాసేవ తన జీవిత లక్ష్యం అని...... ప్రశాంత ఆగపేటకు కృషి చేస్తానని తెలిపారు. ఆగ పేట ఓటర్ మహాశయులు ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకుని ఉన్నారని... ప్రజా ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా తనకు కేటాయించిన కత్తెర గుర్తుకు ఓటు వేయాలని, అలాగే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వార్డు సభ్యులను అత్యధిక మెజార్టీతో గెలిపించి, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ కు గిఫ్ట్ గా ఇవ్వాలని కోరారు.





# రాజ్‌నంద్‌గావ్‌లో 13 మంది మావోయిస్టులు లొంగుబాటు

**ముఖ్యమంత్రి విష్ణు ,హెూం మంత్రి విజయ శర్మ సమక్షంలో లొంగుబాటు**

**లొంగిపోయిన వారిలో కేంద్ర కమిటీ సభ్యులు రామ్దేర్ మజ్జి**

చర్ల, మహా : ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో సి సి ఎం మావోయిస్టు రామ్‌ధేర్ మజ్జి తన 12 మంది సహచరులతో కలిసి లొంగిపోయాడు. ఇది సోమవారం ఉదయం బకర్‌కట్ట పోలీస్ స్టేషన్‌లోని కుంహి గ్రామంలో జరిగింది. అక్కడ అన్ని కేడర్లు తమ ఆయుధాలను విడిచిపెట్టి పోలీసుల ముందు లొంగిపోయారు. భద్రతా సంస్థలు ఈ చర్యను మావోయిస్ట్ నిర్మాణానికి నిర్ణయాత్మక దెబ్బగా భావిస్తున్నాయి. ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, హెూంమంత్రి విజయ్ శర్మ సోమవారం మధ్యాహ్నం 1 గంటలకు పోలీస్ లైన్ రాజ్‌నంద్‌గావ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. డి జి పి అరుణ్ దేవ్ గౌతమ్, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొంటారు. ఈ మొత్తం బృందం ఎం ఎం సి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ స్పెషల్ జోనల్ కమిటీలో చురుకైన భాగంగా ఉంది, ఇది మూడు రాష్ట్రాలలోని ఆరు జిల్లాల్లో ఉనికిని కలిగి ఉంది. ఈ మొత్తం బృందం ఎం ఎం సి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ స్పెషల్ జోనల్ కమిటీలో చురుకైన భాగంగా ఉంది, ఈ కమిటీ మూడు రాష్ట్రాలలోని ఆరు జిల్లాల్లో ఉనికిని కలిగి ఉంది. రామ్‌ధేర్ మజ్జీ ఏ కె-47తో లొంగిపోవడం మావోయిస్ట్ సంస్థలో అతిపెద్ద మలుపుగా పరిగణించబడుతుంది. అతనితో పాటు, ఎ కె-47లు మరియు ఇన్సస్ లు వంటి ఆయుధాలను కలిగి ఉన్న డివిసియం ర్యాంక్ చందు ఉసేండి, లలిత, జానకి మరియు ప్రేమ్ కూడా లొంగిపోయారు. వీరితో పాటు, ఎసిఎం స్థాయి మావోయిస్టులు రాంసింగ్ దాదా మరియు సుకేష్ పొట్టం కూడా లొంగిపోయారు. ప్రాంతీయ మహిళా మిలిషియా (పి ఎం)కి చెందిన లక్ష్మి, షీలా, యోగితా, కవిత మరియు సాగర్ పోలీసులకు లొంగిపోయారు. ఈ నక్సలైట్ల బృందం నుండి ఏకే 47లు, ఇన్సస్ లు, ఎస్ ఎల్ ఆర్ లు, 303లు మరియు 30 కార్బైన్‌లు వంటి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు, ఎంఎంసి జోన్‌లో చురుకుగా ఉన్న ప్రముఖ నక్సలైట్ సిసి సభ్యుడు రాంధేర్ లొంగిపోయాడు. ఖైరాఘర్, రాజ్‌నంద్ గావ్‌లో రాంధర్ తన సహచరులతో కలిసి లొంగిపోయాడు. లొంగిపోయిన వారిలో రామ్‌ధేర్ మజ్జి ,చందు ఉసెండి,లలిత,జానకి, ప్రేమ, రామ్ సింగ్దాదా,సుకేష్,పొట్టం ,లక్ష్మి ,షీలా ,సాగర్,కవిత,యోగిత ,రాంధేర్ , మావోయిస్టులు లొంగి పోయారు

# మా ఇంటి ఓటు అమ్మబడదు

**అశ్వారావుపేట, మహా:** ఎన్నికల పర్వం నడుస్తున్న వేళ, ఓటు హక్కు విక్రయంపై విస్తృత చర్చ జరుగుతున్న నేపథ్యంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, తిరుమలకుంట గ్రామానికి చెందిన ఓ యువకుడు వినూత్న నిరసనతో ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఓటు విలువను, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ ఆశయాన్ని చాటిచెబుతూ ఏకంగా తన ఇంటి గేటుకే ప్రత్యేకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి స్ఫూర్తిగా నిలిచాడు. అశ్వారావుపేట మండలం, తిరుమలకుంట గ్రామానికి చెందిన గడ్డం సతీష్ గౌడ్ (తండ్రి: గడ్డం పుల్లారావు) ఈ వినూత్న నిరసనను చేపట్టారు. సాధారణంగా ప్రజలు తమ ఇంటి గేట్లపై శుభకార్యాల వివరాలు, యూదుకాణం బోర్డులు పెట్టడం చూస్తుంటాం. కానీ, సతీష్ గౌడ్ ఏకంగా తమ ఇంటి ప్రధాన గేటుకు “మా ఇంటి ఓటు అమ్మబడదు!” అనే సందేశంతో కూడిన ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ చర్య ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే అతని సంకల్పాన్ని స్పష్టం చేసింది. ఈ ఫ్లెక్సీలో కేవలం నిరసన సందేశం మాత్రమే కాకుండా, డా.బి.ఆర్. అంబేద్కర్ ఆశయాన్ని ప్రతిబింబిస్తూ, ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలిపే స్పష్టమైన సందేశాన్ని కూడా ముద్రించారు. “ఓటు హక్కు ద్వారానే మనం పాలకులమవుతాము. దానిని తెలివిగా ఉపయోగించాలి. ఓటు అమ్ముకుంటే, మన భవిష్యత్తును మనమే నాశనం చేసుకున్నట్లు అవుతుంది. మంచి నాయకుడిని ఎంచుకోవాల్సిన బాధ్యత మన అందరిది!” ప్రతి ఓటరు తమ ఓటు హక్కును విలువైనదిగా భావించి, స్వార్థ ప్రయోజనాల కోసం దాన్ని అమ్ముకోవడాన్ని నివారించాలనేదే తన ముఖ్య ఉద్దేశమని సతీష్ గౌడ్ తెలిపారు. ఒక్క ఓటు అమ్మకానికి దారితీసినా, అది మొత్తం సమాజ భవిష్యత్తుకు నష్టమని ఆయన ప్రజలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. తాజాగా ఈ వినూత్న సంఘటన తిరుమలకుంట గ్రామంలోనే కాక, పరిసర ప్రాంతాల్లోనూ మంచి స్పందన తెస్తోంది. సతీష్ గౌడ్ యొక్క ఈ ఆలోచనను పలువురు ప్రశంసిస్తున్నారు.

